# దొంగబుద్ధి

శ్రీనివాస్ మొహం కోపంతో ఎర్రబడింది.

ఈసారి వచ్చే బస్సులో ఎలాగైనా ఎక్కేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికి మూడు బస్సులు వచ్చాయి. వెళ్ళిపోయాయి. శ్రీనివాస్ ఒక్క బస్సులోనూ ఎక్కలేకపోయాడు.

ఆ తోపిడి, బలప్రదర్శన, సర్కస్ ఫీట్లు అంటే శ్రీనివాస్‌కి అలర్జీ. అందుకే అతను గంట ముందుగా ఇంట్లో బయలుదేరి స్కూలుకు హాయిగా నడిచి వెళ్తాడు.

కానీ ఈ రోజు.. చద్దన్నం మిగల్లేదు. తెల్లవారకముందే చేతికి చిక్కిన వస్తువులని మూట గట్టుకొని పారిపోయాడు తండ్రి. డబ్బాలో ఉన్న కాసిని బియ్యాన్ని కూడా వదల్లేదు.

శ్రీనివాస్ తండ్రి సాంబయ్య ఎక్కడో చిన్న ఉద్యోగం చేసేవాడు. తాగుడు అలవాటుంది. లంచం తీసుకొంటూ పట్టుబడి ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాడు.

ఉద్యోగం పోయిందన్న బాధలో తాగుడు ఎక్కువ చేశాడు. కానీ ఇల్లు గడిచే దెలాగా అన్న ఆలోచన మాత్రం చేయలేదు.

శ్రీనివాస్ తల్లి పార్వతమ్మ నడుం విరిగేటట్లు ఆ పనులూ, ఈ పనులూ పగలస్తమానం చేసి సంపాదించి ఇల్లు నెట్టుకొస్తోంది.

"అమ్మా, నువ్వొక్కదానివీ ఏం బాధపడ్తావ్? నేనూ ఏదన్నా పని చేసి సంపాదిస్తాను.' శ్రీనివాస్ తల్లి కష్టాన్ని చూడలేక ఎన్నోసార్లు అన్నాడు.

"అదీ - అదిరా, బిడ్డా, మాటంటే! నేనూ నీకు అదే చెప్పాలనుకొంటున్నాను. ఎంత చదువుకొన్నా ఏం లాభం? డబ్బు సంపాదించే మార్గాలు తెల్సుకో. ఇప్పటి ధనవంతుల్లో చాలామంది అట్లాంటి వాళ్ళే. అదృష్టం ఉంటే నువ్వు అయిదేళ్ళలో లక్షాధికారి వయిపోవచ్చు. నాతోరా. ఆ మార్గాలు నీకు చూపిస్తాను." సాంబయ్య కొడుక్కి హితబోధ చేశాడు.

"తా చెడ్డ కోతి వనమెల్లా చెరిచిందనీ... ఇట్లా దుర్మార్గంగా ఆలోచించే సంసారాన్ని ఈకాడికి తెచ్చావ్, చాలదూ? వాడిని కూడా చెడగొట్టాలనా? అందుకు నేనూరుకోను. వాడు చదువుకోవాలి. న్యాయమార్గంలో డబ్బు సంపాదించాల" పార్వతమ్మ మొగుడిని దబాయించింది. కొడుకుని చదివిస్తున్నది.

"ఒరేయ్ శీనూ! నువ్వు మా కష్టాలను గురించి పట్టించుకోమాక, బాగా చదువుకో.'

శ్రీనివాస్‌కి చదువు ప్రాణం. పార్వతమ్మకు శ్రీనివాస్ అంటే ప్రాణం. అడగకుండానే అతని అవసరాలు తెలుసుకొని తీరుస్తుంది.

కానీ, సాంబయ్య ఇంటికొచ్చిన రోజు ఆమె ఆలోచనల్ని, ఆశల్ని తలకిందులు చేసి పోతుంటాడు. ఇవాళ భర్త చేసిన నిర్వాహకానికి ఆమె నివ్వెర పోయింది.

"అమ్మా! అన్నం లేకపోతే లేకపోయింది. నేను బడి కెళ్తాను. నువ్వు బాధపడకు.' ఆ రోజు శ్రీనివాస్ అన్నాడు.

"అన్నం తినకుండా బడి కెళ్తావా? వద్దు నాయనా. ఒక్క క్షణం ఆగు."

ఎలా సంపాదించిందో, బియ్యం తెచ్చింది. అన్నం వండింది. పులుసులో కలిపి ఇంత అన్నం డబ్బాలో పెట్టి కొడుక్కిచ్చింది.

అప్పటికే స్కూలు వేళ అవుతోంది. నడిచిపోతే స్కూలుకు సకాలంలో చేరుకోలేడు. అంచేత బస్సుకు పోవాలని స్టాండ్‌కు వస్తే ఇలా.

అదుగో బస్ వస్తోంది. అది తన స్కూల్‌వైపు వెళ్ళేదే - యీసారైనా ఎక్కాలి.

బస్సు ఆగీఆగగానే ఆడా-మగా ఎగబడ్డారు. దిగేవాళ్ళకు అడ్డంగా హ్యూమన్ వాల్ కట్టేశారు. అయినా ఆ వాల్‌ను దాటుకొని దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు.

శ్రీనివాస్ గుప్పిటి బిగించి తల వెంట్రుకల్ని పైకి తోసుకొన్నాడు. మొలతాడులో నుంచి పిన్నీసు తీసి చేతిలో పట్టుకొన్నాడు.

ఒక్క ఉదుటున ముందుకు లంఘించాడు.

"అబ్బా!"... అబ్బా!"

అలా చాలామంది అరిచారు. ఒక్కొక్కరు అరిచినప్పుడు శ్రీనివాస్ ఒక్కొక్కరిని దాటుకొంటూ బస్సు లోపలికి పోయి పడ్డాడు.

"రైట్!" బస్సు కదిలింది.

తీరా చూస్తే శ్రీనివాస్ అప్పుడు బస్సులో తనలాంటి స్టూడెంట్స్ మధ్య ఉన్నాడు. కానీ వాళ్ళంతా చాలా ఖరీదైన స్టూడెంట్స్. ఖరీదైన స్కూల్లో చదువుతున్నారు. ఖరీదైన యూనిఫారాల్లో ఉన్నారు.

శ్రీనివాస్ వేసుకొన్నది కూడా యూనిఫారమే. కానీ వారి యూనిఫారం ముందు అతని యూనిఫారం వెలవెల పోయింది.

"ఒరేయ్ గురుకుల విద్యార్థిగారివేళ బస్సెక్కార్రోయ్?"

పిల్లలంతా నవ్వారు. చిలకపలుకుల ఇంగ్లీషు స్కూలు పిల్లలు వాళ్ళు. వారికి శ్రీనివాస్ చదివే స్కూలంటే చాలా తేలిక భావం ఉంది. ఆ స్కూల్లో ఇంగ్లీషుతో పాటు తెలుగు., సంస్కృతాలను కూడా నేర్పుతారు. పుస్తకాల చదువుతో పాటు మానసిక ఎదుగుదలకు పనికొచ్చే విద్యను కూడా నేర్పుతారు.

"రామః రామేః రామాః !" ఒక విద్యార్థి రామ శబ్దాన్ని ఎగతాళిగా చదివాడు. "హే చెంబూ హేతప్పేలా హేఅండా" అంటూ మరో విద్యార్థి శంభు శబ్దాన్ని ఆటలు పట్టించాడు.

"ఎ ఎస్ ఎస్ - ఏస్, డిఒజి - డాగ్, సిఏటి - కేట్, ఎంఓఎన్‌కెఈవై - మంకీ, డిఓఎన్‌కేఈవై - డాంకీ" అంటూ ఎగతాళిగా అరవాలన్నంత కోపం వచ్చింది శ్రీనివాస్‌కి.

కానీ బురదగుంటలో రాయి వేస్తే బురద చింది మొహానపడటం తప్ప లాభమేముంది?

ఈలోగా బస్సు 'జెర్క్' ఇచ్చింది. ఆ అదును చూసుకొని ఎవరో కుర్రాడు కావాలని ఫోర్స్‌గా శ్రీనివాస్‌ను ముందుకు నెట్టాడు.

శ్రీనివాస్ ఒక్క ఉదుటున ముందుకు తూలాడు. ఆ తూలటంలో సంచిలో టిఫిన్ డబ్బా దేనికో తగిలి పైకెగిరింది. అందులో పులుసన్నం పక్క సీటులో ఉన్న ఓ తెల్లబట్టల వ్యక్తి గుడ్డల్ని ఖరాబు చేసింది. మరికొంత పులసన్నం వెదజిమ్మినట్లు బస్సులో అక్కడక్కడా పడింది.

"హాయ్ హాయ్... జెమినీ సర్కస్..." పిల్లలు అరిచారు.

తెల్లబట్టల వ్యక్తి సీటులో నుంచి విసురుగా లేచాడు - "ఎవడ్రా నువ్వు? కళ్ళు కనిపించటంలా? ఒళ్ళు కొవ్వెక్కిందా?" అంటూ ఈడ్చి శ్రీనివాస్‌ను చెంపకాయ కొట్టాడు.

బస్సు ఆగిపోయింది.

✡ ✡ ✡

కింద పడ్డ పులుసన్నాన్ని ఎత్తివేయందే బస్సు కదలటానికి వీల్లేదన్నారు బస్సు లోని జనం.

"చిన్నపిల్లాడి మీద చెయ్యి చేసుకోవటం ఏం బాగాలేదు సార్. అతనేమన్నా కావాలని మీ గుడ్డల్ని ఖరాబు చేశాడా? తోపిడిలో టిఫిన్ డబ్బా..."

అలా శ్రీనివాస్‌ను వెనకేసుకు వస్తూ ఎవరో పెద్దమనిషి తెల్లగుడ్డల మనిషితో అనటంలో ఆరంభమయింది అక్కడి కథ.

"ఎలా చేస్తే నేమండీ, నా డ్రెస్ పాడయిందా, లేదా? ఈ డ్రెస్‌తో ఆఫీస్‌కు వెళ్ళనా? తిరిగి ఇంటికి వెళ్ళి డ్రెస్ ఛేంజ్ చేసుకు పొమ్మంటారా? ఇప్పుడు నా కెంత టైమ్ వేస్ట్? ఒక్క నిముషం కోల్పోతే నేను ఎంత డబ్బు నష్టపోతానో మీకు తెలుసా?"

దాంతో జనానికి ఆ తెల్లబట్టల మనిషెవరో ధనవంతుడని బోధపడింది. ఇటు చూస్తే శ్రీనివాస్ పులుసన్నాన్ని టిఫిన్‌లో పెట్టుకొని వెళ్తున్నవాడు. పైగా ఆ యూనిఫారంకి అన్ని చినుగులేమిటి? కుట్లేమిటి?

"అయినా టిఫిన్ డబ్బాలో పులుసన్నం ఏమిటండీ? నయం. గుడ్డలమీద పడబట్టి సరిపోయింది. కంట్లో పడితే ఏమన్నా ఉందా?"

"తిన తిండి లేకపోయినా పొగరు కేం లోటు లేదండీ. అసలీ కుర్రాడు బస్ ఎలా ఎక్కాడో తెలుసా?"

"ఎలా?"

"ముందున్న వాళ్ళను సూదితో పొడిచి".

"ఆ?"

దాంతో శ్రీనివాస్ పట్ల సింపతీ అందరికీ పోయింది. అంతా అతన్ని అసహ్యంగా చూశారు. దోషిని చేశారు.

శ్రీనివాస్ ఏం మాట్లాడలేదు.

స్కూలుకు టైం అయిపోతున్నదని తను అన్నం తిననన్నాడు. టిఫిన్ డబ్బాలో అన్నం పెట్టింది అమ్మ. ఆ అన్నం ఇప్పుడు నేలపాలయింది. తను మళ్ళీ ఇంటికి పోయేదాకా ఆకలితో నకనక లాడిపోవలసిందే! ఇంటికి వెళ్ళగానే అమ్మ కీ విషయం తెలిస్తే ఎంత బాధపడుతుంది?

"ఏరా దొంగ రాస్కెల్! మాట్లాడవేం? అన్నం ఎత్తరా, బస్సు శుభ్రం చెయ్యి. నీవల్ల బస్సు ఆగిపోయింది. మేము ఆఫీసులకి వెళ్ళక్కరలేదా? పనులు చూసుకోనక్కర్లేదా?"

అన్నాన్ని తుడిచి శుభ్రం చేయటం నామోషీ అనుకునే తత్వం కాదు అతనిది. అది సేవకింద, కర్తవ్యంగా భావిస్తాడతను. కానీ ఈ మనుషుల ధోరణి చూస్తుంటే అతనికి కోపంగా ఉంది. వీరికి డబ్బంటే ఎంత గౌరవం? బీదవారంటే ఎంత అసహ్యం?

అంతలోనే అతనికి తను స్కూలుకి ప్రేయర్ సమయానికి వెళ్ళాలని గుర్తు కొచ్చింది. ప్రేయర్ చెయ్యాల్సింది తనే. తను వెళ్ళకపోతే హెడ్‌మాస్టర్ నొచ్చుకుంటాడు.

"అలాగే, అన్నాన్ని తుడిచి బస్సును శుభ్రం చేస్తాను. కానీ ముందు బస్సును స్టార్ట్ చేయమనండి".

"రైట్ రైట్..."

బస్ స్టార్ట్ అయింది.

శ్రీనివాస్ కింద కూర్చుని పులుసన్నాన్ని టిఫిన్ డబ్బాలోకి ఎత్తుతున్నాడు.

అప్పుడతని కంటికి సీట్ కింద ఒక వస్తువు కనబడింది.

✡ ✡ ✡

బస్ దిగాడు శ్రీనివాస్.

భుజానికి వేలాడుతున్న స్కూల్ బాగ్ బరువెక్కినట్లుంది.

అతను చాటు కెళ్ళి బాగ్ తెరిచాడు. అందులో నుంచి ఒక కవరు తెర్చాడు.

వంద నోట్లు. అతను వాటిని లెక్కించాడు. ఇరవై అయిదు నోట్లు. అంటే ఇరవై అయిదు వందలు!

ఆ డబ్బు ఎవరిదో తను ఊహించగలడు. తెల్లదుస్తుల పెద్దమనిషిదై ఉండాలి. అతని సీటు కిందనే ఈ డబ్బు దొరికింది తనకి!

డబ్బును చూడగానే, ఆ విషయాన్ని పెద్దగా అరిచి అందరికీ చెప్పాలనిపించింది తనకి. ఎవరిదైతే వారికి తిరిగి ఇవ్వాలనిపించింది.

కానీ అంతలోనే కచ్చ! ధనమదాన్ని ఇంత బహిరంగంగా ప్రదర్శించిన వారికి, దొరికిన సొమ్మును తను ఎందుకివ్వాలి? తన మంచితనాన్ని ఎవరు గుర్తిస్తారు? ఏడ్చి చావనీ-

అతను దాన్ని బాగ్‌లోకి తోసేశాడు.

కానీ ఆ కవరు బాగ్‌లోకి చేరిన దగ్గరి నుంచి బాగ్ బరువెక్కి అతనికి భారంగా అనిపించసాగింది.

ఇప్పుడు ఈ డబ్బు నేం చేయాలి? గుట్టుగా దాచిపెట్టి అవసరమైనప్పుడు తల్లికి సాయపడవచ్చును.

కానీ దొంగసొమ్ము అని తెలిస్తే తల్లి మండిపడుతుంది. బాధపడుతుంది. తను మాత్రం ఆ భారాన్ని ఎంతకాలం మోయగలడు. వద్దు. ఆ పాపిష్టి డబ్బు తన కొద్దు. అది తిరిగి ఆ డబ్బు యజమానికే చేరాలి. కానీ ఎలా?

పోలిస్ స్టేషన్ కెళ్ళి అప్పగిస్తే? తనని మెచ్చి మెడల్స్ ఇవ్వరు. ఏదో దొంగతనాన్ని తన నెత్తిన రుద్దినా రుద్దగలరు. డబ్బు యజమానికి ఛస్తే చేరదు. పేపర్లో ఎన్ని వార్తలు చదవటం లేదు?

అతనికప్పుడు స్కూలు గుర్తుకొచ్చింది.

స్కూల్లో ఈ సరికి ప్రార్థన అయిపోయి ఉంటుంది. క్లాసులు ఆరంభమై ఉంటాయి.

ప్రార్థన ఆరంభమయ్యాక పిల్లలెవరూ ఆ స్కూలుకు రారు. గేట్లు ముయ్యటం, గేట్లు తెరవటం లాంటి ఆచారాలు ఆ స్కూలుకి లేవు. ఎవరన్నా ఎప్పుడన్నా స్కూల్లోకి స్వేచ్ఛగా వెళ్ళవచ్చు, వద్దనరు.

కానీ ప్రార్థనకు ముందుగానే స్కూలుకు రావటం ఆ స్కూలు క్రమశిక్షణ. దాన్ని బలవంతంగా పిల్లల నెత్తిన రుద్దరు. పిల్లలే ఆ క్రమశిక్షణను గౌరవించేలా చేస్తారు. సెల్ఫ్ డిసిప్లిన్‌ను విద్యార్థులలో పెంచడమే ఆ స్కూలు ప్రత్యేకత.

తనింతవరకు స్కూలుకు ఆలస్యంగా ఎన్నడూ వెళ్ళలేదు. ప్రార్థన చెయ్యాల్సింది తనే. అందుచేత తనెప్పుడూ ముందుగానే వెళ్తాడు. కానీ ఇవాళ ...?

ఆలస్యమయినా స్కూలుకు వెళ్ళక తప్పదు. తన నెత్తిన ఉన్న ఈ బరువును తొలగించగల వ్యక్తి ఒక్కడే. స్కూలు హెడ్‌మాస్టరు! ఆయనకి జరిగిందంతా చెప్పాలి. అతను స్కూలు వైపు పెద్ద పెద్ద అడుగులు వేస్తూ నడిచాడు.

✡ ✡ ✡

వెంకటరత్నం చేతి గడియారం చూసుకొన్నాడు. సరిగ్గా పదిన్నర అయింది.

ఆఫీసు అటెండన్సు రిజిష్టర్‌లో పొట్టి సంతకం, ఒక ఆఫీసు ఫైలు మీద పొడుగు సంతకం పెట్టాల్సిన సమయం ఇది. అయినా తనింకా బస్సులోనే ఉన్నాడు.

పొట్టి సంతకం విలువ తన ఉద్యోగం. అయినా దాన్ని ఎప్పుడన్నా పెట్టవచ్చు. తన చేతుల్లో ఉన్న పని.

కాని ఫైల్లో సంతకం వెల ఇరవై అయిదు వందలు! పార్టీ అడ్వాన్సుగా డబ్బు చెల్లించి వెళ్ళేడు. పదిన్నరకు ఆర్డర్ ఇవ్వాల్సిన బాధ్యత తన మీద ఉంది. తను మాటంటే మాటే మరి! కాకపోతే గుడ్‌విల్ దెబ్బతినిపోదూ?

వెంకటరత్నం మాటమీద నిలబడతాడని పేరు. కానీ అతని మాటకు రేటుంది. ఇంటి దగ్గర ఆ రేటు చెల్లించాలి. ఆఫీసులో ఆర్డర్ తీసుకోవాలి. అది అతని పద్ధతి. మధ్యవర్తులు, మొహమాటాలు అతనికి పనికిరాదు. అంతా డైరెక్ట్ వ్యాపారం.

వెంకటరత్నం అసలు వ్యాపారస్తుల కుటుంబంలోనే పుట్టాడు. చిన్నతనంలోనే కాలు

వంకర, కన్ను వంకరలు వచ్చాయి. అవే అతని పాలిట వరాలయ్యాయి. గుమాస్తా ఉద్యోగ సంపాదనకు మెట్లయ్యాయి. ఎదిగేకొద్దీ అతని బుద్ధి మరీ వంకరలు తిరిగిపోయింది.

ఆఫీసును ఆఫీసుగా అతనెన్నడూ చూడలేదు. కిరాణా దుకాణంగానే భావించాడు. ఆఫీసులో కాదేది వ్యాపారానికనర్హం.

అతనెంత సంపాదించిందీ అతనికి మాత్రమే తెలుసు. సంపాదించిన దొంగ సొమ్మును ఎలా దాచాలో అతనికి తెలిసినట్లు మరెవరికీ తెలియదు.

ఇంట్లో కానీ, జేబులో కానీ అతను పది రూపాయలకు మించి ఎప్పుడూ ఉంచడు. డబ్బు సంపాదించడం సులభం. కానీ దాన్ని రహస్యంగా జాగ్రత్త చేయడమే కష్టం. ఇంట్లో వసూలు చేసిన డబ్బును ఆఫీసుకు వెళ్ళేలోగా ఏదో రూపంలో భద్రపరచడం అతని అలవాటు.

ఇవాళ కూడా అలాంటి ప్లాన్‌తోనే బయలుదేరాడు. కానీ ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. ఆటోలో వెళ్ళిపోయినా బాగుండేది.

ఆటోలో వెళ్ళటం అతనికోలెక్క కాదు. ఎంత అక్రమ సంపాదన చేసినా పైకి మాత్రం బీద అరుపులు అరుస్తూ ఉండాలన్నది అతని నియమం.

డబ్బును ఆఫీసుకు వెళ్ళేముందే దాయాలా, లేక ఆఫీసుకు వెళ్ళిం తరువాత నిదానంగా ఆ డబ్బు సంగతి చూడాలా అని ఆలోచనలో ఉండగా అతని చెయ్యి పాకెట్‌లోకి వెళ్ళింది.

అంతే. తేలు కుట్టినట్లు ఒక్కసారి సీటులో నుంచి ఎగిరి లేచాడు.

"డబ్బు ... నా డబ్బు... ఎవరో కొట్టేశారు. బాబోయ్... దొంగ !"

అంతా కలిసి, ఆ డబ్బు కింద పడితే, పులుసన్నం తుడిచిన కుర్రాడే చూసి దొంగిలించుకుపోయి ఉంటాడని నిర్ణయించారు.

"పోలీస్ రిపోర్టివ్వండి".

వెంకటరత్నం అంత వెర్రివాడు కాదు.

"బాబూ! మీ కెవరికైనా ఆ కుర్రాడి ఇల్లు తెలుసా?"

కుర్రాళ్ళలో ఎవరో తెలుసునన్నాడు.

"బాబూ! నేను బీదవాడిని. అవిటివాడిని. నాకు మీరే సాయం చెయ్యాలి. నన్ను ఆ అబ్బాయి ఇంటి దగ్గరికి తీసుకెళ్ళరూ?

అతని నటనకు కరిగిపోయి పిల్లలతో పాటు కొందరు పెద్దలు కూడా అతనికి సాయంగా నిలబడడానికి ముందు కొచ్చారు.

✡ ✡ ✡

దొమ్మీకి వచ్చినట్లు కట్టకట్టుకుని వచ్చిన జనాన్ని చూసి భయపడిపోయింది పార్వతమ్మ.

"ఏమయింది బాబూ! మా శ్రీను ఏం చేశాడు?"

"ఏం చేశాడా? దొంగతనం చేశాడు. ఈ బాబు బస్సులో సీటు క్రింద పడేసుకున్న డబ్బును తీసుకుని పారిపోయాడు. ఏడీవాడు? డబ్బెక్కడ దాచావ్?"

"నా బిడ్డ దొంగతనం చేశాడంటే నేను నమ్మను. ఇందులో ఏదో పొరపాటుంది.'

"తల్లీ బిడ్డలు కలిసే ఈ పని చేసి ఉంటారు. దొంగబుద్ధులు ఎక్కడికి పోతాయి? పోలీసులకి రిపోర్టిస్తే కాని వీళ్ళ తిక్క కుదరదు. పదండి. పోలీస్ స్టేషన్‌లో రిపోర్టిద్దాం."

"అలాగే పదండి. నేనూ వస్తాను. పోలీస్ స్టేషన్‌కి" పార్వతమ్మే ముందు నడిచింది.

వెంకటరత్నం ప్రమేయం లేకుండానే అంతా పోలీస్ స్టేషన్‌కి చేరుకొన్నారు.

అక్కడ ఎస్సైగారు, ఫోన్ వస్తే స్కూలుకు వెళ్ళినట్లు తెలిసింది.

"నా బిడ్డ చదివేది ఆ స్కూల్‌లోనే. అక్కడి కెళ్తే అసలేం జరిగిందో తెలుస్తుంది. వెళ్దాం పదండి". పార్వతమ్మ అంది.

వెంకటరత్నానికి గుండెలో రైళ్ళు పరుగెత్తాయి.

"అబ్బే... ఎందుకులెండి? టైమ్ వేస్ట్. ఆ కుర్రాడు తీసి ఉండడు. అనవసరంగా పోలీస్ గొడవలెందుకు. వెళ్దాం పదండి. పెద్దగా డబ్బేం పోలేదులెండి."

"అలా కుదరదు సార్! ఈ సంగతేమిటో తేల్చుకోవాల్సిందే. ఇవాళ మీ డబ్బయింది. రేపు మా డబ్బవుతుంది. స్కూలు కెళ్దాం." అన్నారు.

✡ ✡ ✡

"నన్ను క్షమించండి సార్! నా బీదరికాన్ని అవమానించారన్న కోపంలో ఒక్క క్షణం మీరు చెప్పిన పాఠాలన్నింటినీ మరిచిపోయాను. నాది కాని ఆ సొమ్మును రహస్యంగా దాచాను. దొంగనయ్యాను. నా పాపానికి శిక్ష విధించండి సార్!

హెడ్‌మాస్టర్ రంగనాథం, శ్రీనివాస్‌ను రెండు చేతులతో దగ్గరికి తీసుకొన్నాడు. వాత్సల్యంతో తల నిమిరాడు. కన్నీళ్ళు తుడిచాడు.

"శిక్షా? నీకు? ఎందుకూ? నువ్వు పుణ్యం చేశావే కానీ, ఏ పాపం చెయ్యలేదు! డబ్బు దాచటం పాపమంటావా? ఆ తప్పు నీది కాదు. ఆ తప్పు నీ చేత చేయించిన వారిది . నువ్వలా కూర్చో. పోలీసులకి ఫోను చేసి, ఆ డబ్బెవరిదో వారికిప్పిస్తాను. అంతవరకు ఆ పొట్లాన్ని ఈ కవరులో పెట్టి సీల్‌వేసి నా టేబిల్ మీద ఉంచుతాను."

వెంటనే బయలుదేరి వస్తానన్నాడు ఎస్సై. కానీ అతనికన్న ముందుగానే వెంకటరత్నం జనంతో అక్కడి కొచ్చాడు.

"అడుగో... వాడే... వాడే... దొంగతనం చేసి పారిపోయి వచ్చాడు." జనం శ్రీనివాస్‌ని చూసి అరిచారు.

"నా బిడ్డ దొంగతనం చెయ్యడు హెడ్‌మాస్టరు బాబూ! ఏరా శ్రీనూ! నువ్వు వాళ్ళ డబ్బు దొంగిలించావా?"

"నీబిడ్డది దొంగబుద్ధి కాదమ్మా! ఆ బుద్ధి ఉంటే దొరికిన డబ్బును తీసుకుని నా దగ్గరికి రాడు. హోటలుకో, సినిమా హాలుకో, ఇంకెక్కడికో పోయేవాడు. ఇంతకీ డబ్బెవరిది? ఎంత పోయింది?"

అంతా వెంకటరత్నం వైపు చూశారు.

ఎస్సై ఇంకా రాలేదు. తన డబ్బు తను దక్కించుకుని వెళ్ళిపోతే సరి.

"నాదే సార్! పొట్లంలో ఇరవై అయిదు వంద రూపాయల నోట్లు ఉన్నాయి.'

"ఇరవై అయిదొందలా? పెద్దగా ఏం పోలేదన్నారు కదా ఇందాక!"

" ఇప్పుడూ అదే అంటాను."

"కానీ బస్సులో బీదవాడిని, అవిటివాడిని సాయం చెయ్యండని ప్రాధేయపడ్డారు? మీరు బీదవారా? ధనవంతులా? ముందు అది తేల్చండి."

వెంకటరత్నం ఇరుకున పడ్డాడు.

"ఇన్ని అబద్ధాలు చెప్పిన మిమ్మల్ని పెద్దమనిషిగా నమ్మి, మీ సాయంగా వచ్చాం.అంత డబ్బును తెచ్చి హెడ్‌మాస్టరుగారికి అప్పగించిన ఆ అబ్బాయిని దొంగ అన్నాం. ఇందులో లిటిగేషన్ ఉంది. పోలీసులు వచ్చిందాకా ఆ డబ్బు ఇవ్వద్దు సార్!"

"అదలా ఉంచండి. కానీ మీ అందరినీ నేనొకటి కోరనా?"

"చెప్పండి".

"బీదరికాన్ని ద్వేషించండి. అసహ్యించండి. బీదవాళ్ళను కూడా మనుషుల్లా గౌరవించటం నేర్చుకోండి. లేకపోతే ఋజుమార్గంలో నడిచే శ్రీనివాస్ లాంటి పిల్లలు కూడా దొంగలు, దోపిడీదారులు, హంతకులు అవుతారు."

"నిజమే సార్! నా తప్పు ఒప్పుకుంటున్నాను. అందుకే ఆ కుర్రాడి నిజాయితీని అభినందిస్తూ అయిదు వందల రూపాయలు బహుమతిగా ఇస్తున్నాను."

హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ వైపు చూచాడు.

" పులుసు అన్నం బట్టలమీద పడితే ఆ మరకలను నీళ్ళతో కడిగేసుకోవచ్చు సార్! కానీ గాయపడిన మనసును ఎంత డబ్బు కూడా కడిగెయ్యలేదు.పేదలను ఇకనైనా ప్రేమించడం నేర్చుకొంటే నా కదే పదివేలు." శ్రీనివాస్ అన్నాడు.

"అయితే ఆ డబ్బును మీ స్కూల్‌కి డొనేషన్‌గా స్వీకరించండి సార్! ఏదైనా అభివృద్ధి పనులకు ఆ డబ్బును వినియోగించండి".

"మా స్కూలు అభివృద్ధికి కావల్సింది డొనేషన్లు, డబ్బు కాదు సార్. ధర్మ తత్పరులైన ఇలాంటి మరి కొందరు బాలురు. అలాంటి వారిని తయారుచేయగలిగితే మీరూ తయారుచేయండి." ఆ డబ్బున్న కవరును అతనికి అందించబోతున్నాడు.

మోటార్ సైకిల్ దిగి ఎస్సై వచ్చాడు.

"ఆగండి హెడ్‌మాస్టర్‌గారూ!"

అంతా ఎస్సై వైపు చూశారు.

"ఆ డబ్బు లంచం సొమ్ము. ఇతను పెద్ద వంకర గుమాస్తా. పోలీసులకి చెప్పే పొద్దున అందులోని ఇరవై అయిదు వంద రూపాయల నోట్లను అతనికి ఇంటి దగ్గరిచ్చారు. అవి తనవేనని అంగీకరించి ఇతను ఇప్పుడు రెడ్‌హాండెడ్‌గా దొరికిపోయాడు. ఈసరికి మావాళ్ళు ఇతని గుప్తధనాన్ని పైకి తీసే ఉంటారు. పద మిష్టర్ వెంకటరత్నం! యు ఆర్ అండర్ అరెస్ట్! అన్నాడు ఎస్సై గంభీరంగా.

ఆంధ్రప్రభ వారపత్రిక 19-9-90